# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!





## కాంగ్రెస్‌కు కండ్లమంట ఎందుకు..?

నాకు 5 ఎకరాల భూమి ఉంది. వరి, పత్తి సాగు చేసుకుంటున్న. కాంగ్రెసోళ్లు మూడు గంటల కరెంట్ చాలంటున్రు. మాకు బావులు, బోర్ల కింద సాగు చేసుకోవడం తప్ప వేరే దారి లేదు. ఉమ్మడి రాష్ట్రంలో ఐదారు గంటల కరెంట్ ఇచ్చిన్రు. అప్పుడూ పంటలు ఎండిపోయి నష్టాలు చూసినం. బీఆర్‌ఎస్ సర్కార్ కోతల్లేకుండా కరెంట్ ఇస్తున్నది. నిరంతరం విద్యుత్ ఇస్తే కాంగ్రెస్ ఓర్చుకోలేకపోతుంది. కాంగ్రెస్‌కు కండ్ల మంట ఎందుకు? వాళ్ల పాలనలో బాయికాడ మోటరు పెట్టుకోడానికి టార్చిలైట్లు పట్టుకుని కటిక చీకట్లో వెళ్లి గోసపడ్డం. చేన్లలో పాము కాట్లతో రైతులు చచ్చిపోయిన్రు. ఆనాటి కటిక చీకట్లు మాకద్దు. 24 గంటల కరెంట్ ఇస్తున్నోళ్లకు మా మద్దతు. మల్లా సీఎం కేసీఆర్ సారే రావాలి.

**-తమ్ముడవేని రాజు, రైతు, గొల్లపల్లె (జూలపల్లి)**

## 3 గంటల కరంట్‌తో ఎవుసం నడవదు



కాంగ్రెస్ వస్తే మళ్లీ కరంట్ కష్టాలు తప్పవు. మూడు గంటల కరంట్‌తో ఒక మడి కూడా పారదు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు మేము పడ్డ బాధలు ఇంకా మరిచిపోలేదు. మూడు గంటల కరంటంటే ఎవుసం బంద్ పెట్టి కూలీ నాలీకి పోవుడే. ఇచ్చే కరంట్ గూడా సక్కగ ఇయ్యలే. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినంకనే రైతుల కష్టాలన్నీ పోయినయ్. 24గంటల పాటు కరంట్ ఇస్తున్రు. లో వోల్టేజీ సమస్యలు పోయినయ్. మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోత లేవు. బీడు భూములన్నీ సాగులోకి వచ్చినయ్. రైతులకు ఏ బాధ రాకుండా ఎవుసం మంచిగ నడుస్తుంది. అందుకే కాంగ్రెస్‌ను రైతులెవ్వరూ నమ్మరు. రైతుబంధు, రైతు బీమా ఇస్తూ ఆసరా అవుతున్న కేసీఆర్‌కే అండగా నిలుస్తాం.

**- ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, రైతు, పొత్కపల్లి (ఓదెల)**

## కోతల్లేని కరెంట్ నయం

నాకు ఐదెకరాల భూమి ఉన్నది. వరి పంట సాగు చేసుకుంటున్న. మూడు గంటల కరెంటంటున్న కాంగ్రెస్‌కు అధికారం వస్తే చీకటి రోజులే మిగులుతయి. ఎవుసానికి 24 గంటల పాటు ఉచితంగా కరెంట్ ఇస్తే దండిగా పంటలు పండించుకుంటున్నం. ఇప్పుడూ కాంగ్రెస్ నాయకులు 10 హెచ్‌పీ వ్యవసాయ మోటర్లు పెట్టుకోవాలంటున్రు. ఉమ్మడి పాలనలో కరెంట్ కరవై ధర్నాలు చేసిన్రు. ఆనాటి కరెంట్ కష్టాలు, కటిక చీకట్లు కలలో కూడా రావద్దు. మాకు ఇప్పుడా కరెంట్ కష్టాలు దూరమైనయ్. కరెంట్ మోటర్ల ద్వారా ఎప్పుడూ పడితే అప్పుడూ పంటలకు సాగు నీరు పెట్టుకుంటున్నం. కాంగ్రెసోల్లు అధికారంలోకి వచ్చేది లేదు.. సచ్చేది లేదు. రైతులమంతా కేసీఆర్‌కు మద్దతు తెలుపుతున్రు. ఎట్లయిన గెలిపించుకుంటం.

**- మేచినేని ఆనందరావు, రైతు, కుమ్మరికుంట (జూలపల్లి)**





## కాంగ్రెస్ వస్తే కరెంట్ కటకటే..

తెలంగాణ రాకముందు కరెంట్ ఎప్పుడు వత్తదో తెలియక తెల్లందాక బాయిలకాడనే పడుకునేది. నడి రాత్రి కరెంట్ వస్తే మోటర్ గంటకూడా పోయ కముందే మళ్లా బందయ్యేది. అద్దబీగడు గూడా తడువక పోయేది. కానీ తెలంగాణ వచ్చినంక కరెంట్ బాధలు తప్పినయ్. ఎప్పుడు తీరితే అప్పుడు వెళ్లి మోటర్లు పెట్టుకుంటున్నం. ఏ రందీలేకుంట పొలం పారించుకుంటున్నం. రెండు పంటలు పండించుకుంట నాలుగు పైసలు కండ్ల జూత్తున్నం. కానీ కాంగ్రెస్సోళ్లేమో రైతులు బాగుంటే ఓర్తలేరు. మూడు గంటల కరెంట్ మత్తయిదని మమ్ముల పరేషాన్ జేత్తున్నరు. వాళ్లు గెలిసేది లేదు..పోయేదు లేదు కానీ కిరికిరి కథలు చెబుతున్నరు. పొరపాటున వాళ్లుగిట్ల అధికారంల కత్తే ఎనుకటి కథ మళ్లా మొదలైతది.

**- శంకర్, మల్కాపూర్ రైతు (జ్యోతినగర్)**

# మీ దరిద్రపు పాలన మాకద్దు

### నాడు ఎన్ని కష్టాలు పెట్టారో మేం మరిచిపోలే

- యాభై ఏండ్లు పాలించి చేసింది గుండు సున్నా
- మూడు గంటలతో ఏం పంట పండించుకోమంటవ్
- మీరు వచ్చేది ఉందా..? సచ్చేది ఉందా..?
- తెలివి ఉన్నోడు ఎవడన్నా.. 10హెచ్‌పీ మోటర్ పెట్టుకుంటడా..?
- ఒక్కో రైతు లక్ష రూపాయలు ఎక్కన్నుంచి తెమ్మంటరు
- మీరు ఫ్రీగా ఇస్తరా..? కొనిస్తరా..?
- స్పష్టం చేస్తున్న రైతులోకం

పెద్దపల్లి, నవంబర్ 24(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ డేంజర్ పార్టీ. రైతులను గోసపెట్టే పార్టీ. ముందునుంచీ రైతులకు వ్యతిరేకి. యాభై ఏండ్లకుపైగా పాలించి ఏం చేసింది..?, గుండు సున్నా. కరెంట్ ఇయ్యక, నీళ్లు ఇయ్యక గోసపెట్టింది. పంటలు ఎండిపోతున్నా కనీసం పట్టించుకోలె. చచ్చిపోతున్నా సంబంధం లేన్నట్లే ఉన్నది. వేలాది మందిని పొట్టనబెట్టుకున్నది. తెలంగాణ వచ్చి కేసీఆర్ సీఎం అయ్యాక 24 గంటల కరెంట్ ఇస్తుంటే.. కండ్లుమండించుకుంటున్నది. ఇప్పుడిప్పుడే మేం మంచిగా బతుకుతున్నం. ఆ దరిద్రపు పార్టీ మాకెందుకు..? ఏదో వెలగబెడతాం అన్నట్టు.. ఆ పార్టీ పార్టీ నాయకులు వచ్చి మాకు మాయమాటలు చెబుతున్రు. వాళ్లను ఎవడైనా నమ్ముతడా..? ఉరికిచ్చుకుంట కొడుతరు. బీఆర్‌ఎస్ సర్కారు 24గంటల కరెంట్ ఇస్తాంటే.. వాళు మూడుగంటలు ఇస్తరట.. మతి ఉండే మాట్లాడుతున్నరా..? 24గంటలు ఉండంగ వాని కరెంట్ ఎవరికి కావాలి..? 10 హెచ్‌పీ మోటర్ అంటున్నరు. ఒకసారి అందరూ ఆలోచించాలి. అంత పెద్ద



మోటర్ రైతులెవరైనా వాడుతరా..? మేం ఇంత వ్యతిరేకిస్తున్నా..? మేమేదో చేస్తామంటూ నమ్మించే ప్రయత్నం చేస్తున్రు. మమ్మల్ని ఆగం చేయాలని చూస్తున్రు. మళ్లీ మేం మోసపోం. మా బతుకుల్లో మట్టి పోసుకోం' అని జిల్లా రైతులు స్పష్టం చేస్తున్నారు. బీఆర్‌ఎస్ సర్కారు రైతుల కోసం 24 గంటల కరెంట్, సాగునీరు, రైతు బంధు, రైతుబీమా ఇస్తున్నదని, అన్నదాతలు ఇప్పుడిప్పుడే సంతోషంగా బతుకున్నారని చెబుతున్నారు. కానీ, కాంగ్రెస్ ఓర్వలేకపోతున్నదని, అందుకే కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదని, మంచి పథకాలను రద్దు చేస్తామంటున్నదని మండిపడుతున్నారు. ఎన్నికల్లో ఎలాగైనా లబ్ధిపొందాలన్న ఉద్దేశ్యంతో అబద్ధపు హామీలు, ఝూటా మాటలు చెబుతున్నదని విమర్శించారు. ఆ పార్టీని నమ్మేది లేదని, ఈ ఎన్నికల్లో కచ్చితంగా బుద్ధి చెబుతామంటున్నారు. రైతుకు అన్ని విధాలా అండగా నిలిచిన బీఆర్‌ఎస్ సర్కారునే మళ్లీ గెలిపించుకుంటామని చెబుతున్నారు.

## రేవంత్‌రెడ్డి మతి తప్పి మాట్లాడుతున్నడు..



కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతులకు మూడు గంటల కరెంట్ సాలంటున్నడు. గిట్లయితే 10 ఎకరాలున్న నాలాంటి ఎవుసందార్లు ఉన్నభూమి ఎండబెట్టుకోవాల్సి వత్తది. పెట్టుబడి కూడా ఎళ్లక అప్పుల పాలు కావాల్సి వత్తది. ఆయన మతి ఉండి మాట్లాడుతున్నడా అర్థంకావడం లేదు. అయినా ఎదో గెలిచినట్టు గప్పాలు కొడుతున్నడు. గిట్ల అడ్డంపొడుగు నరేకేటోనికి ఎవరైనా ఓటేత్తరా? లేని కుంపటి నెత్తిమీద పెట్టుకుంటరా. వాళ్ల పార్టీ అధికారంలోకి రానేరాదు. మళ్లా కేసీఆరే సీఎం అవుతడు. రైతులకు మళ్లింత మేలు జేత్తడు.

**-కొమ్మిడి శంకర్‌రెడ్డి (రైతు, రామునిపల్లి)**

## 10హెచ్‌పీతో రైతుకు ఆర్థిక భారమే



10హెచ్‌పీ మోటర్ పెట్టుకోవాలంటే రైతులకు ఆర్థికంగా ఇబ్బందే. 10హెచ్‌పీ మోటర్ కేవలం పరిశ్రమలకే ఉపయోగపడుతయి. ఎవుసానికి 10 హెచ్‌పీ మోటర్లు వాడతరనడం కాంగ్రెసోళ్ల అజ్ఞానం. కరంట్ సక్రమంగా ఇయ్యలేమని చెప్పలేక 10హెచ్‌పీ మోటర్ల జోలి తీస్తున్రు. కాంగ్రెస్ వస్తే మళ్లీ కరంట్ బాధలు తప్పవు. తప్పిదారి ఓటేత్తే కచ్చితంగా మోటర్లకు మీటర్లు పెట్టి ఉచిత కరెంట్ లేకుండా చేస్తరు. అట్లయితే ఇక ఎవుసం పోయినట్టే. మా రైతుల జీవితాలు ఆగమైనట్టే. అందుకే మల్లా బీఆర్‌ఎస్‌కు ఓట్లు వేయడానికి రైతులందరం సిద్ధంగా ఉన్నం. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉంటే రైతులకు ఏ కష్టాలు రావు. కాంగ్రెస్ మాయమాటలను రైతులు ఎవరు నమ్మరు.

**- రౌతు జలపతి, రైతు, జీలకుంట (ఓదెల)**

## 3 గంటల కరంటంటే ఎన్కటి గోసే



నాకు రెండెకరాల భూమి ఉన్నది. వరి పంట పండించుకుంటున్న. కాంగ్రెస్ మూడు గంటల కరెంట్ అంటే రైతులు ఎన్కటి లెక్క గోస పడుడే. మూడు గంటల కరెంట్ సాలంటున్రు. పెద్ద మోటర్లు పెట్టుకోమంటున్రు. పెద్ద మోటర్లు పెడితే ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోయి ఇబ్బందులు పడుతం. మాలాంటి చిన్న, సన్నకారు రైతుల పరిస్థితేంది. కిరికిరి ముచ్చట్లు పెట్టి ఆగం చేస్తే మీకొచ్చేదేంది. మళ్లా పాత కరెంట్ కథలే మొదలైతయ్. ఎవుసం గురించి మీకేం ఏం తెల్సని మాట్లాడుతున్రు. ఎవుసం తెల్వనోళ్లు ఏదోదో మాట్లాడి రైతులను ఆగం పట్టిస్తే మంచిగుండదు. మాకు మేలు చేసినోళ్లకే ఓటేస్తం. 24 గంటల కరెంట్ ఇచ్చిన కేసీఆర్ సారుకు ఓట్లెయ్యాలే.

**- గుంటి బీరయ్య, రైతు, జూలపల్లి**

## 3 గంటల కరెంటోనికి ఓటుతోనే బుద్ధిచెప్తం.



నెలకిందట టీవీల పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాట్లాడంగ టీవీల జూసిన. ఆయన ఎవుసం గురించి ఎం తెలుసోగని రైతులకు మూడు గంటల కరెంట్ చాలని, 24 గంటలిత్తే వట్టిగనే పోతదని అనంగ నా చెవుల నిండ విన్న. అప్పుడే అనుకున్న ఆయనకు ఎవుసమేంటే ఎం తెలియదని. మూడు గంటలిత్తే మూడు గుంటలకు గూడా నీరందదు. కానీ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఊర్లళ్లకు వచ్చి 24 గంటల కరెంట్ ఇత్తమని ఊదరగొడుతున్నడు. అయినా నేనడుగు తున్నా. ఒక్కపార్టీలనే గిన్నీ మాటలు ఉంటయా? గిసోంటి ఆగంజేసే బాపతిగాళ్లను ఎవ్వలు నమ్మతురు. మూడు గంటల కరెంటోనికో ఓటుతోనే బుద్ధి చెబుతం. మంచిగా కరెంటిత్తున్న కేసీఆర్‌నే మళ్లీ తెచ్చుకుంటం.

**-వొల్లపు రాజయ్య, మల్కాపూర్ రైతు (జ్యోతినగర్)**